రైతు పొలంలో పాతిన హద్దు రాయి

పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నిస్తున్న రైతు

చావనైనా చస్తాం..భూములియ్యం

- గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ బాధితుల ఫైర్
- రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా
- ఫిర్యాదుకు కోసం వస్తే అడ్డగింత
- పెట్రోల్ పోసుకున్న అన్నదాత
- భూముల్లో రాళ్లు పాతారని గరం
- భూములు లాక్కుంటే ఆత్మహత్యే శరణ్యమని రైతుల ఆవేదన

రంగారెడ్డి, మార్చి 10 (నమస్తేతెలంగాణ): ఫ్యూచర్ సిటీ కోసం వేస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ బాధితులు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆత్మహత్యకు ప్రయత్నించారు. మహేశ్వరం మండలం రావిర్యాలకు చెందిన సుమారు పది మంది రైతులు పెట్రోల్ బాటిళ్లతో కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తామని చెప్పినా ప్రధానగేటు వద్దే పోలీసులు వారిని అడ్డుకోవటంతో కాళ్లావేళ్లాపడి బతిలాడారు. అయినా కనికరించకపోవడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఓ రైతు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. చావనైనా చస్తాం గాని గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూములు ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లాలోని మీర్‌ఖాన్‌పేట్ నుంచి వేసే గ్రీన్ ఫీల్డ్ రోడ్డు కోసం ఓఆర్‌ఆర్ నుంచి కొంగరకలాన్, రావిర్యాల తదితర గ్రామాల్లో భూసేకరణ చేపట్టారు. మహేశ్వరం మండలం రావిర్యాల, కొంగరకుర్దు గ్రామాల పరిధిలోని 13 సర్వే నంబర్‌లో రైతులు కాసుల బాలరాజుకు చెందిన రెండెకరాల 17 గుంటలు, కాసుల సుధాకర్‌కు చెందిన ఎకరం 32 గుంటలు, జీ రమాదేవికి చెందిన 20 గుంటలు, కుడుముల రవీందర్‌కు చెందిన ఎకరం 20 గుంటలు, గున్నాల నర్సింహకు చెందిన మూడెకరాల 20 గుంటల పట్టా భూముల్లోంచి 300 ఫీట్ల రోడ్డు వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాగా రైతులు ఆ భూముల్లో వరి, పూల తోటలు, కూరగాయల సాగుతో జీవనం సాగిస్తున్నారు. తమకు ఆధారమైన భూముల్లో రోడ్డువేసే తమ బతుకులు రోడ్డున పడుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ సర్వే పనులను అడ్డుకున్నారు. కాగా పోలీసుల సాయంతో రెవెన్యూ, సర్వే అధికారులు సోమవారం హద్దురాళ్లు పాతేందుకు వచ్చారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, పరిహారం ప్రకటించకుండా హద్దురాళ్లు ఎలా పాతుతారని రైతులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల పహారా నడుమ అధికారులు హద్దురాళ్లను పాతుతూ రైతులను బలవంతంగా అక్కడి నుంచి పంపించి వేశారు. దీంతో రైతులు ఆవేదనతో కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ప్రజావాణిలో అధికారులను కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. చేసేది లేక పదిమంది రైతుల్లో బాలరాజు అనే రైతు పెట్రోల్ మీద పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని అక్కడి నుంచి వెళ్లగొట్టారు.

చావే దిక్కు

కావాలనుకుంటే ప్రాణాలు వదులుతాం తప్ప భూములను వదులుకోం. మా అన్నదమ్ములిద్దరికి చెరో రెండెకరాల పొలం ఉన్నది. దానిపైనే ఆధారపడి బతుకుతున్నం. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం మా భూములను ప్రభుత్వం గుంజుకుంటున్నది. మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. పరిహారం కూడా ఇవ్వకుండానే స్వాధీనం చేసుకుంటున్నరు. మా భూములకు బదులు వేరేచోట భూమి ఇవ్వాలని కోరినం. లేదంటే మార్కెట్ రేట్లైనా ఇవ్వాలని కోరినం. అయినా మా మొర వినిపించుకుంటలేరు. మా పట్టా భూములను గుంజుకోవటానికి ముఖ్యమంత్రి ఎవరు? పరిహారం ఇవ్వకుండా ఎలాంటి పనులు చేయడానికి వచ్చినా మేమంతా మా కుటుంబాలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటం.

–రైతులు సుధాకర్, యాదయ్య, రావిర్యాల

టన్నెల్‌లో సహాయక చర్యలు ముమ్మరం చేయాలి

రెస్క్యూ పనులపై అరవింద్‌కుమార్ సమీక్ష

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ఘటనకు సంబంధించి చేపట్టిన సహాయ చర్యలను ముమ్మరం చేయాలని రెస్క్యూ బృందాలకు డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన టన్నెల్ కార్యాలయంలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌తో కలిసి రెస్క్యూ బృందాలతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఇప్పటివరకు కొనసాగిన సహాయక చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. టన్నెల్ ప్రమాదంలో కార్మికుడు, పంజాబ్ రాష్ట్రానికి చెందిన గురుప్రీత్‌సింగ్ మృతిపై సంతాపం వ్యక్తంచేశారు. రెస్క్యూ బృందాలు సమన్వయంతో పనిచేస్తూ సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని సూచించారు. రెస్క్యూ బృందాలకు, అధికారులకు, పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, అవసరమైన అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ వైభవ్ రఘునాథ్, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఇతర రెస్క్యూ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఫ్యూచర్‌సిటీకి కొత్త మెలిక!

- ల్యాండ్‌పూలింగ్‌కే మొగ్గు చూపుతున్న ప్రభుత్వం
- హెచ్ఎండీఏ పరిధిలో 60:40% పద్ధతి
- రైతులకు 50% గా యోచన
- ఒప్పుకోబోమంటున్న రైతులు
- 16వేల ఎకరాల సేకరణకు టీజీఐఐసీ ఏర్పాట్లు

రంగారెడ్డి, మార్చి 10 (నమస్తేతెలంగాణ): రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేయతలపెట్టిన ఫ్యూచర్ సిటీ కోసం ల్యాండ్‌పూలింగ్ విధానం ద్వారా భూసేకరణ చేపట్టాలని సర్కారు యోచిస్తున్నది. ఈ మేరకు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్‌సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఫార్మాసిటీ కోసం సేకరించిన 14 వేల ఎకరాలు ఇప్పటికే అందుబాటులో ఉండగా, మరో 16 వేల ఎకరాలను సేకరించాల్సి ఉన్నది. భూసేకరణకు మాత్రం బాధిత గ్రామాల రైతులు ససేమిరా అంటూ ఎక్కడికక్కడే అడ్డంకులు సృష్టిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ల్యాండ్‌పూలింగ్ విధానాన్ని ఎంచుకున్నది. ఈ విధానం ద్వారా టీజీఐఐసీ ఆధ్వర్యంలో రైతుల అంగీకారం తీసుకుని భూములను అభివృద్ధి చేసి 50% ప్రభుత్వానికి, మరో 50% రైతులకు ఇచ్చేలా భూసేకరణ చేపట్టాలని సర్కార్ యోచిస్తున్నది. ల్యాండ్‌పూలింగ్ విధానంలో భూములు ఇవ్వడానికి 80% మంది రైతులు అంగీకరించాల్సి ఉన్నది. ఫ్యూచర్‌సిటీ ప్రకటన నేపథ్యంలో ఈ ప్రాంత భూములకు విపరీతమైన ధరలు పెరిగాయి. దీంతో ల్యాండ్ పూలింగ్‌కు రైతులు ఏ మేరకు సహకరిస్తారన్నది, వారిని ఏమేరకు ఒప్పిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. గతంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో చేపట్టిన ల్యాంపూలింగ్ విధానంలో 40% ప్రభుత్వానికి, 60% రైతులకు అందజేశారు. టీజీఐఐసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ ల్యాండ్ పూలింగ్ విధానంలో 50% కేటాయింపునకు రైతులు ముందుకు వస్తారా? అనేది సమస్యగా మారింది. పూలింగ్ కోసం గ్రామాల్లోని రైతులను ఒప్పించాల్సి ఉన్నది. ఈ మేరకు ఆయా గ్రామాల్లో రైతుల అంగీకారం తీసుకోవడం కోసం త్వరలోనే టీజీఐఐసీ, రెవెన్యూ అధికారులతో సమావేశాలు నిర్వహించాలని సర్కారు నిర్ణయించింది.

నిద్రించిన చోటే విగతజీవిగా పడి ఉన్న విద్యార్థిని లాలిత్య

లాలిత్య మరణంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లి లక్ష్మీబాయి

గురుకులంలో విద్యార్థిని మృతి

- రాత్రి భోజనం చేసి పడుకున్న తర్వాత లేవని చిన్నారి
- బిడ్డ చనిపోయిందని ఏడుస్తున్న తండ్రిని లాక్కెళ్లిన పోలీసులు
- రేవంత్‌కు పిల్లల పాపం తగలక మానదు : మాజీ మంత్రి కేటీఆర్
- సమగ్ర విచారణ చేపట్టాలి: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్, మార్చి 10(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో 83 మంది గురుకులాల విద్యార్థులు మరణించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని లాలిత్య(13) మరణించింది. బజార్‌హత్నూర్ మండలం మొర్కండికి చెందిన లాలిత్య ఆదివారం రాత్రి భోజనం చేసి నిద్రించింది. ఉదయం నోటి నుంచి నురగలుకారి అనుమానాస్పద స్థితిలో మరణించింది. విద్యార్థిని తల్లిదండ్రులు రాజేశ్వర్, లక్ష్మీబాయిలు కూలీ పని చేసుకుంటూ లాలిత్యను ఇచ్చోడ ఆశ్రమ పాఠశాలలో చదివిస్తున్నారు. మృతదేహాన్ని చూసి అనంతరం తండ్రి రాజేశ్వర్‌ను పోలీసులు లాక్కొని పోవడంపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కోల్పోయిన తండ్రి ఆవేదనను అర్థం చేసుకోకపోవడం బాధాకరమని విద్యార్థి సంఘాల నేతలు విమర్శించాయి.

విద్యార్థిని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మానవత్వంలేని రేవంత్ సర్కార్

- గురుకులాల మరణ మృదంగాన్ని
- ఆపడం చేతగాని ప్రభుత్వం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో విద్యార్థుల మరణమృదంగాన్ని ఆపడం రేవంత్‌రెడ్డి సర్కార్‌కు చేతగాకపోవడంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. గురుకులాల్లో విద్యార్థులు మరణిస్తున్నా పట్టించుకోకుండా కనీస మానవత్వం చూపడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసమర్థ సర్కారు తీరుతో ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ బాలికల ఆశ్రమ పాఠశాలలో లాలిత్య అనే తొమ్మిదో తరగతి విద్యార్థిని అనుమానాస్పద మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కళ్ల ముందు విగతజీవిగా పడిఉన్న బిడ్డ మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదిస్తున్న తల్లిదండ్రులను ఓదార్చాల్సిందిపోయి, ఆ బాలిక తండ్రిని పోలీసులు అదుపులోకి తీసుకోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారు తీరును విద్యార్థుల తల్లిదండ్రులే గాకుండా యావత్ తెలంగాణ సమాజం అసహ్యించుకుంటుందన్నారు. విద్యార్థుల మరణాలు సర్కార్ హత్యలేనని ఆరోపించారు.

నా బిడ్డ ఎట్ల సచ్చిపోయిందో చెప్పలేదు

సోమవారం ఉదయం 8 గంటలకు నా బిడ్డ సచ్చిపోయిందని బడి నుంచి సార్లు ఫోన్ చేసిర్రు. నేను వారితో మా ఊరి పటేల్, గ్రామస్తులతో కలిసి వస్తున్నాం. అప్పటి వరకు నా బిడ్డను అక్కడే ఉంచండని చెప్పా. నేను బడికి వెళ్లేసరికి నా బిడ్డ మృతదేహాన్ని బోథ్ దవాఖానకు తీసుకెళ్లారు. అసలు నా బిడ్డకు ఏమైంది? ఎలా చనిపోయిందని అడిగితే ఎవరూ కారణం సెప్పలేదు. నా బిడ్డ మృతికి కారణాలు తెలిపి, న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.

– చిక్రం రాజేశ్వర్, మృతురాలు లాలిత్య తండ్రి

న్యాయం చేసేంత వరకు పోరాడుతాం

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా లాలిత్య చనిపోయిందని, న్యాయం చేసేంతవరకు పోరాడుతామని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పేర్కొన్నారు. బోథ్ దవాఖానలో విద్యార్థిని కుటుంబ సభ్యులను పరామర్శించి, విలేకరులతో మాట్లాడారు. విద్యార్థి కుటుంబసభ్యులు అధికారులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని చెప్పారు. ఘటనపై విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు

– బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గ్రూప్-1 మెయిన్స్‌లో 500కుపైగా మార్కులు

- అత్యధికంగా 570 మార్కులు
- ఎక్కువ మందికి 470-420
- గ్రూప్-1 ఫలితాలు విడుదల చేసిన టీజీపీఎస్సీ

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలను టీజీపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. పలువురు అభ్యర్థులు 900 మార్కులకు 500కు పైగా మార్కులు సాధించారు. ఓ అభ్యర్థి 570 మార్కులు సాధించగా, ఓ మహిళా అభ్యర్థికి 532.5 మార్కులొచ్చాయి. మరికొందరు 530, 512, 486 మార్కులు సాధించినట్టుగా తెలిసింది. టాపర్ల వివరాలను మాత్రం టీజీపీఎస్సీ వెల్లడించలేదు. 2023 అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించగా, 21వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. మార్కులను అభ్యర్థి లాగిన్ ఐడీలో మాత్రమే పొందుపరిచారు. టీజీపీఎస్సీ ఐడీ, మెయిన్స్ హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ వంటి వివరాల ద్వారా తెలుసుకునే చాన్స్ ఇచ్చారు.

20లోపు అన్ని ఫలితాలు విడుదల

అభ్యర్థులు సోమవారం నుంచి మార్చి 24 సాయంత్రం 5గంటల వరకు రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో పేపర్‌కు రూ. వెయ్యి చొప్పున రీకౌంటింగ్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. రీకౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత అభ్యర్థుల మొత్తం మార్కులను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. జీఆర్ఎల్‌ను విడుదల చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.

నేడు గ్రూప్-2 ఫలితాల విడుదల

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలకానున్నాయి. జనరల్ ర్యాంకింగ్ లిస్టును టీజీపీఎస్సీ మంగళవారం విడుదలచేయనున్నది. 783 పోస్టుల భర్తీకి 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదలకాగా, 5లక్షలకుపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 2023 ఆగస్టు 29, 30న పరీక్షలు నిర్వహించారు.

మూల్యాంకనంలో మాడల్ టీచర్లకు ప్రాధాన్యం ఇవ్వాలి: టీఎంఎస్‌టీఏ

ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనంలో మాడల్ స్కూల్ టీచర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ మాడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ నేతలు కోరారు. చీఫ్ ఎగ్జామినర్, సబ్జెక్టు ఎక్స్‌పర్ట్, సీఎస్‌డీవో విధుల్లో అన్యాయం చేయొద్దని ఇంటర్‌బోర్డు సెక్రటరీ కృష్ణఆదిత్యకు వినతిపత్రం సమర్పించారు.

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల పరీక్ష ఫలితాలు విడుదల

ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-II పోస్టుల భర్తీ కోసం నిరుడు నవంబర్ 11న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సోమవారం ఈ ఫలితాలను విడుదల చేసింది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలను ఫైనల్ కీ ఆధారంగా వెల్లడించారు.

ప్రతీ నోటిఫికేషన్‌కు వర్గీకరణ వర్తింపజేయాల్సిందే

కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోక తప్పదు: మంద కృష్ణ

కవాడిగూడ, మార్చి 10: ప్రభుత్వం ప్రతీ ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఇమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యోగ నియామక పరీక్షల ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇందిరాపార్క్ వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరాహారదీక్షలో మంద కృష్ణ పాల్గొన్నారు. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని స్పష్టంచేశారు. వర్గీకరణ చట్టం వస్తుందని చెబుతూనే ఫలితాలు విడుదల చేయడం మాదిగలకు ద్రోహమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగలకు అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాజకీయ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అన్యాయాన్ని ఎదుర్కొవడానికి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

నిరాహార దీక్షాశిబిరంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ప్రణయ్ హత్య కేసులో ఒకరికి ఉరి

- ఆరుగురికి యావజ్జీవ శిక్ష విధింపు
- సంచలన తీర్పు వెలువరించిన న్యాయమూర్తి రోజారమణి
- కేసులో ప్రధాన నిందితుడు మారుతీరావు ఆత్మహత్య
- దోషులకు సరైన శిక్ష పడింది: ప్రణయ్ తండ్రి బాలస్వామి

ప్రణయ్ హత్యకేసులో శిక్ష పడిన దోషులు

తీర్పు నేపథ్యంలో కోర్టు వద్దకు తరలివచ్చిన జనం, పోలీసు బందోబస్తు

రామగిరి, మార్చి 10: దేశవ్యాప్తంగా సంచలం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు సోమవారం తుది తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఏ-1గా ఉన్న అమృత తండ్రి మారుతీరావు ఇప్పటికే ఆత్మహత్య చేసుకోగా, ఐదున్నర సంవత్సరాలపాటు వాదోపవాదాలు విన్న కోర్టు ఏ2 సుభాశ్‌శర్మకు ఉరి శిక్ష విధించగా, మిగతా ఆరుగురు దోషులకు జీవిత ఖైదు విధించింది. రెండో అదనపు సెషన్ కోర్టు న్యాయమూర్తి, ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి రోజారమణి ఈ సంచలన తీర్పు వెలువరించారు. ఈ తీర్పును ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి స్వాగతించారు.

జరిగింది ఇది..

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన వ్యాపారవేత్త తిరునగరి మారుతీరావు కుమార్తె అమృత, అదే పట్టణానికి చెందిన పెరుమళ్ల బాలస్వామి కుమారుడు ప్రణయ్(ఎస్సీ) 2018 జనవరి 30న ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ కులాంతర వివాహాన్ని అంగీకరించని మారుతీరావు సుపారీ గ్యాంగ్‌తో ప్రణయ్‌ను అదే ఏడాది సెప్టెంబర్ 14న హత్య చేయించారు. ప్రణయ్ తండ్రి బాలస్వామి ఫిర్యాదుతో దర్యాప్తు చేసిన మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు మారుతీరావు సహా ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. అప్పటి నల్లగొండ జిల్లా ఎస్పీ ఏవీ రంగనాథ్ 1,600 పేజీల చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఎనిమిది మందిపై 302, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టుకు సమర్పించారు. ఈ హత్య కేసులో ప్రధాన సూత్రధారి తిరునగరి మారుతీరావు(ఏ-1) కేసు విచారణ సాగుతున్న సమయంలో 2020 మార్చి 7న హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. ఏ-2 సుభాష్‌శర్మ, ఏ-3 అస్గర్ అలీ విచారణ ఖైదీలుగా ఉన్నారు. మిగిలిన ఐదుగురు నిందితులు 2019లో బెయిల్‌పై విడుదలై కోర్టు విచారణకు హాజరవుతున్నారు. ఐదున్నర సంవత్సరాలపాటు ఇరువైపుల వాదోపవాదాలు విన్న కోర్టు సాక్షులను విచారించి వివరాలు నమోదు చేసింది. తాజాగా సోమవారం తుది తీర్పు వెలువరించింది. మారుతీరావు ఇప్పటికే ఆత్మహత్య చేసుకోగా, మిగిలినవారిలో బీహార్‌కు చెందిన సుభాశ్‌కుమార్ శర్మ (ఏ-2)కు ఉరి శిక్షతోపాటు రూ.15 వేలు జరిమానా, నల్లగొండకు చెందిన మహ్మద్ అస్గర్ అలీ(ఏ-3), మహమ్మద్ అబ్దుల్ బారీ(ఏ-4), మిర్యాలగూడకు చెందిన మహమ్మద్ అబ్దుల్ కరీం(ఏ-5), మారుతీరావు సోదరుడు తిరునగరి శ్రవణ్‌కుమార్(ఏ-6), మారుతీరావు డ్రైవర్ సముద్రాల శివ(ఏ-7), నల్లగొండకు చెందిన ఆటోడ్రైవర్ ఎంఏ నజీమ్(ఏ-8)కు జీవిత ఖైదీతోపాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధించింది. కేసు దర్యాప్తులో సరైన ఆధారాలను సేకరించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి నిందితులకు శిక్ష పడేలా చేసిన అప్పటి విచారణాధికారి, మిర్యాలగూడ డీఎస్పీ శ్రీనివాస్, సబ్ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కుమార్, ప్రస్తుత డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీఎన్‌డీ ప్రసాద్, ఎస్ఐ సైదిరెడ్డి, సిబ్బంది వీరస్వామి, మధుసూదన్, నరేందర్, మల్లికార్జున్, కేసులో ప్రత్యేక న్యాయవాదిగా ఉన్న దర్శనం నర్సింహను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

శ్రవణ్‌రావు కూతురు హల్‌చల్

తీర్పు అనంతరం మారుతీరావు సోదరుడు శ్రవణ్‌కుమార్(ఏ-6) భార్య, కుతూరు నల్లగొండ కోర్టులో బోరుమన్నారు. పోలీసులు తన తండ్రిని అన్యాయంగా కేసులో ఇరికించారని, బెదిరించి బ్లాంక్ పేపర్ల మీద సంతకం చేయించుకున్నారని, నిర్దోషిగా విడుదల చేయాలని, లేనిపక్షంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని కూతురు స్ఫూర్తి విలపించారు.

నిజం గెలిచింది..

నిజం గెలిచింది.. కష్టానికి ఫలితం దక్కిందని ప్రణయ్ హత్య కేసును వాదించిన లాయర్, నల్లగొండ స్పెషల్ పీపీ దర్శనం నర్సింహ తెలిపారు. కోర్టు తీర్పు హర్షణీయమని, ఈ తీర్పు కుల దురహంకారులకు తీవ్ర హెచ్చరిక అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సరైన శిక్ష పడింది

ప్రణయ్‌ను అతి దారుణంగా చంపిన నిందితులకు కోర్టు సరైన శిక్ష విధించిందని పెరుమాళ్ల బాలస్వామి తెలిపారు. ప్రణయ్ హత్య తర్వాత కూడా రాష్ట్రంలో చాలా పరువు హత్యలు జరిగాయని, అలాంటి వారందరికీ కోర్టు ఇచ్చిన తీర్పుతో కనువిప్పు కలగాలని తెలిపారు. అంత కుముందు కుటుంబసభ్యులు ప్రణయ్ సమాధి వద్దకు వెళ్లి నివాళులర్పించారు. ప్రణయ్‌ను తలుచుకొని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. -ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి

కోర్టు తీర్పు హర్షణీయం

కుల దురహంకారులకు ఈ తీర్పు తీవ్రహెచ్చరిక: జాన్‌వెస్లీ

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): కుల దురహంకార హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష, మరో ఆరుగురికి జీవిత ఖైదు విధిస్తూ సోమవారం నల్లగొండ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ఈ తీర్పు కుల దురహంకారులకు తీవ్ర హెచ్చరిక అని పేర్కొన్నారు. 2018లో నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ప్రణయ్, అమృత కులాంతర వివాహం చేసుకోగా, కుల దురహంకారంతో అమృత తండ్రి మారుతీరావు ప్రణయ్‌ను నడిరోడ్డు మీద కిరాతకంగా హత్య చేయించారని చెప్పారు. ఈ హత్యకు వ్యతిరేకంగా, అమృతకు అండగా సీపీఎం నిలబడిందని, దోషులను కఠినంగా శిక్షించాలని పార్టీ ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు జరిగాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో నేటికీ ఇలాంటి హత్యలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ తీర్పువల్లనైనా కుల దురహంకారులకు కనువిప్పు కలగాలని ఒక ప్రకటనలో తెలిపారు.

యాదగిరిగుట్టలో వైభవంగా చక్రతీర్థం

యాదగిరిగుట్ట, మార్చి10: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి తిరు కల్యాణోత్సవం అనంతరం విశేష ఘట్టమైన శ్రీచక్రత్ ఆళ్వార్లకు పుణ్యతీర్థ స్నానం సోమవారం వైభవంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణిలో లక్ష్మీసమేతుడైన యాదగిరీశుడిని స్నానమాచరిస్తున్న సమయంలో యాదాద్రి వాసా.. యాదగిరి వాసా, గోవిందా గోవిందా నామస్మరణతో గుట్ట మార్మోగింది.

స్వామివారి సేవలో గవర్నర్

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాలలో నిర్వహించిన మహాపూర్ణాహుతిలో గవర్నర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆశీర్వచనం అందిస్తున్న ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు

ఎస్సీ గురుకుల సొసైటీలో బది'లీలలు'!

- జీవో 317 బదిలీల్లో అధికారుల ఇష్టారాజ్యం
- చంటిబిడ్డలతో ఆఫీస్ ముందు రోజంతా ఉద్యోగుల నిరీక్షణ

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో టీచర్ల బదిలీలలో నెలకొన్న గందరగోళం కొలిక్కిరావడం లేదు. అసలు సొసైటీలో ఏం జరుగుతున్నదో తెలియడం లేదని టీచర్ల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. 317 జీవోకు సంబంధించిన బదిలీల్లో సీనియర్లకు కాదని జూనియర్లకు ప్రాధాన్య మిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారుల సూచన మేరకు సోమవారం సొసై